
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం। 4। ఏప్రిల్। 2023



ఎన్‌జీటీ అనుమతిచ్చేనా?

సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు నిలిపివేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై ధర్మాసనం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 8లో



బీఆర్ఎస్‌ను దించడమే లక్ష్యం

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రారంభమై క్రమంగా పెరుగుతుంది.



న్యూస్‌రీల్

రామాలయంలో అష్టలక్ష్మీ పీఠం నిర్వాహకులు



పూజలు చేస్తున్న రఘునాథాచార్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని విశాఖపట్నం కొండకొప్పాక లోని అష్టలక్ష్మీ పీఠం నిర్వాహకులు పీతాంబరం రఘునాథాచార్యులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

న్యూట్రీషన్ కిట్లు సకాలంలో అందించాలి

- డీఎంహెచ్‌ఓ శిరీష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: గర్భిణులకు సకాలంలో న్యూట్రీషన్ కిట్లు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ బాధితులను కూడా నిర్లక్ష్యం చేయకుండా కిట్లు అందించాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్. మణికంఠా రెడ్డి, ఇమ్మానియేలు, దుర్గ పాల్గొన్నారు.

జ్యోతిష్య మార్తాండ బిరుదు ప్రదానం



అప్పలాచార్యను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాల్వంచ: పాల్వంచకు చెందిన ప్రముఖ పంచాంగకర్త, జ్యోతిష్య, వాస్తు పండితులు గొడవర్తి సంపత్‌కుమార్ అప్పలాచార్యకు జ్యోతిష్య మార్తాండ బిరుదును ప్రదానం చేశారు. ఏపీలోని ఒంగోలు సంతపేటలో గల షిర్డీ సాయి బాబా మందిరంలో నిర్వహించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగ రచనా రజతోత్సవ వేడుకల్లో అప్పలాచార్య ఈ బిరుదు అందుకున్నారు. కమిటీ ప్రతినిధులు నీలం పూర్ణమోహన్, ప్రసాద్ శర్మ, సంస్థ అధ్యక్షుడు దైవజ్ఞ, డాక్టర్ జూలూరి భానుమూర్తి సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్‌గా అప్పాజీ



ప్రభాకర్ రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అప్పాజీ

పాల్వంచ: కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎ.అప్పాజీ నియమితులయ్యారు. హైదరాబాద్ సెక్రటేరియట్ బీఆర్ భవన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అప్పాజీ అసిస్టెంట్‌గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. ఆయనను కేటీపీఎస్ కమాండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

టెండర్ జాడేది ?

రూ.కోటి వస్తుంటే కాదంటున్నారు !

- ఆదాయ మార్గాలపై పట్టింపేది..
- మార్కెట్ల వేలంపాట ఖరారులో జాప్యం
- గడువు ముగిసినా పట్టించుకోని వైనం



కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బకాయిలు రాబట్టడంలోనే కాదు.. ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టడంలో కూడా కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. అందుకు డెయిలీ మార్కెట్, కబేలా, వీక్లీ మార్కెట్లు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

రూ.కోటికి పైగా ఆదాయం..

మున్సిపాలిటీలకు ఆస్తి పన్ను, వాణిజ్య పన్ను తర్వాత ఆదాయం తెచ్చే మార్గాల్లో మార్కెట్ల వేలం ఒకటి. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో డెయిలీ మార్కెట్, వీక్లీ మార్కెట్లలో జరిగే క్రయ విక్రయాలపై పన్ను విధించడం ద్వారా దాదాపు రూ.కోటి ఆదాయం సమకూరుతోంది. ఈ మార్కెట్లకు టెండర్లు పిలిచి, వేలం పాట ద్వారా పన్ను వసూలు చేసుకునే హక్కును కాంట్రాక్టర్లకు మున్సిపాలిటీ అప్పగిస్తోంది. గతేడాది జూలైలో టెండర్లు, వేలం పాట ప్రక్రియ కొనసాగింది. ఇందులో డెయిలీ మార్కెట్ రూ. 50 లక్షలు, వీక్లీ మార్కెట్ రూ. 50 లక్షలు, కబేలా రూ. 3 లక్షలు పలికింది. వేలం పాట దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఈ ఏడాది మార్చి 31 వరకు ఆయా మార్కెట్లలో పన్ను వసూలు చేసుకునే హక్కు లభిస్తుంది. మున్సిపాలిటీకి సైతం నేరుగా కోటి రూపాయలకు పైగా ఆదాయం సమకూరుతుంది.

కొత్త వేలంపై కాలయాపన..

డెయిలీ, వీక్లీ మార్కెట్లతో పాటు కబేలాకు గత టెండర్ ప్రకారం 2023 మార్చి 31తో గడువు ముగుస్తుంది. కాబట్టి తదుపరి వేలం పాటకు సంబంధించి టెండర్ల ప్రక్రియను ఫిబ్రవరి లేదా మార్చి నెలల్లో నిర్వహించాల్సి ఉంటుంది. అందులో నిబంధనల మేరకు వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే వర్క్ ఆర్డర్ ఇచ్చేలా ప్రణాళికాబద్ధంగా అధికారులు పని చేయాల్సి ఉంది. కానీ ఆదాయ వనరులపై దృష్టి సారించడంలో ఇటు పాలకవర్గం, అటు అధికారులు నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారం వచ్చినా ఇప్పటి వరకు కొత్త టెండర్లు పిలవనే లేదు. ఈ వ్యవహారం ఇంకా చర్చల దశలోనే ఉంది. చర్చలు ముగిసి, మార్కెట్లకు కొత్త ధరలు నిర్ణయించి, అందుకు అనుగుణంగా టెండర్లు పిలవడం, వాటిని ఓపెన్ చేయడం, ఆ తర్వాత పాట నిర్వహించి వర్క్ ఆర్డర్ ఇచ్చేందుకు ఎంత సమయం పడుతుందో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ కాలయాపన కారణంగా కనీసం నెల రోజుల పాటు ఆయా మార్కెట్ల నుంచి వచ్చే ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోనుంది.

సమాధానం చెప్పలేకనే ?

మున్సిపాలిటీలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి ఉన్నారు. అసమ్మతి వర్గమే ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. దీంతో డెయిలీ, వీక్లీ మార్కెట్ల టెండర్లు ఖరారు చేసే విషయంలో అసమ్మతి కౌన్సిలర్లు లేవనెత్తే అంశాలకు దీటైన సమాధానం చెప్పే విషయంలో పాలకవర్గం, అధికారులు ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో వారు ఈ అంశాన్ని ముందుకు తేకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే పాలకపక్షం నిర్లక్ష్యం, వారికి వత్తాసుగా ఉన్న అధికారుల కారణంగా మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతున్నట్టయింది.

పాత బకాయి వసూలుపై స్పష్టత కరువు..

గతంలో డెయిలీ మార్కెట్ వేలంపాట దక్కించుకున్న మాదా శ్రీరాములు మున్సిపాలిటీకి ఇంకా రూ.30 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయి రాబట్టుకోవడం ఎలా అనే అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది వీక్లీ మార్కెట్‌కు సంబంధించి ధరలు నిర్ణయించడంలో అసంబద్ధత, కొత్త నింబంధనలు చేర్చడం సాకుగా చూపుతూ పాట దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ తీసుకోవడానికి సుముఖత చూపలేదు. దీంతో ఇక్కడ ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై ఇంత వరకు చర్చ జరగలేదు. కబేలా విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

త్వరలోనే టెండర్లు



కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని డెయిలీ మార్కెట్, వారపు సంత, కబేలాకు సంబంధించి కొత్త టెండర్ల విషయంలో కసరత్తు చేస్తున్నాం. ఏప్రిల్ 15 కల్లా టెండర్లు పిలిచి ప్రాసెస్ మొదలు పెడతాం. మున్సిపాలిటీ ఆదాయం కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

–జి. రఘు, మున్సిపల్ కమిషనర్

జోలాలాలి.. పాడాలి..

- భద్రాద్రి రామయ్యకు ఘనంగా ఊంజల్ సేవ
- రేపటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం



ఊంజల్ సేవలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బేడా మండపంలో సోమవారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆస్థాన హరిదాసులు వీనుల విందుగా లాలలు, జోలలు పాడుతుండగా అర్చకులు ఈ వేడుకను జరిపించారు. సుందరంగా అలంకరించిన ఊయలలో శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత హారతి సమర్పించారు. భక్త రామదాసు, తూము నర్సింహదాసు రచించిన కీర్తనలను హరిదాసులు ఆలపిస్తుండగా.. స్వామి వారికి నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం స్వామి వారికి వాహన సేవ నిర్వహించారు.

నేడు వసంతోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి వసంతోత్సవం జరపనున్నారు. బుధవారం నిర్వహించే చక్రతీర్థం, ధ్వజావరోహణం, పుష్ప యాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రద్దు చేసిన స్వామివారి నిత్యకల్యాణ వేడుకలు బుధవారం పునఃప్రారంభం అవుతాయి.

రామాలయంలో అంతర్గత బదిలీలు ?

శ్రీ సీతారాముల కల్యాణం, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు ముగియడంతో దేవస్థానం అధికారులు పరిపాలనా పరమైన అంశాలపై దృష్టి సారించారు. ఇటీవల ఈఓగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అవి విజయవంతంగా పూర్తి కావడంతో ఆలయంపై తనదైన ముద్ర వేసేలా చర్యలు చేపడుతున్నారు. దేవస్థానంలోని అన్ని శాఖలపై సమగ్ర సమాచారం తెలుసుకున్న ఆమె.. అంతర్గత బదిలీలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొంతమందిని పలు శాఖలకు బదిలీ చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

జూలూరుపాడు: చిరుధాన్యాలు తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జిల్లా సంక్షేమాధికారి(డీడబ్ల్యూఓ) స్వర్ణలత లెనినా అన్నారు. ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జూలూరుపాడు, చంద్రుగొండ మండలాల అంగవాడీ టీచర్లతో పాపకొల్లులో సోమవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఉంటుందని, పోషకాహారంతో ఈ సమస్యను దూరం చేయవచ్చని అన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరల్లో అధిక పోషక విలువలు ఉంటాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులకు సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అంతకుముందు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించి ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చంద్రుగొండ సీడీపీఓ నిర్మలజ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, ఎం.లక్ష్మి, సుజాత, అరుణ, శకుంతల, రాణి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు షురూ..



కొత్తగూడెం బాబుక్యాంప్ ఏరియాలోని కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

- జిల్లాలో 12,540 మందికి 12,480 మంది విద్యార్థుల హాజరు
- నాలుగు కేంద్రాల్లో డీఈఓ తనిఖీ



బాబుక్యాంప్ ఉన్నత పాఠశాలలో తనిఖీలు..



కిన్నెరసానిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎలాంటి ఆటంకాలు లేకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష మొదలు కాగా, విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. హాల్ టికెట్ నంబర్లు, రూం నంబర్లు సరి చూసుకోగా, 9 గంటల నుంచి లోనికి అనుమతించారు. గతేడాది 70 శాతం సిలబస్ నుంచి పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది 100 శాతం సిలబస్‌లో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహించారు. కేంద్రాల్లోకి విద్యార్థులు వెళ్లే ముందు వైద్య సిబ్బంది శానిటేషన్ చేశారు. ఉపాధ్యాయులు తనిఖీ చేసి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించలేదు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 70 పరీక్ష కేంద్రాల్లో 12,540 మందికి గాను 12,480 మంది విద్యార్థులు హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఇక ప్రైవేటు విద్యార్థుల కోసం మరో రెండు సెంటర్లు ఏర్పాటు చేయగా, వాటిలో 175 మందికి 149 మంది విద్యార్థులు హాజరయ్యారని, 26 మంది గైర్హాజరయ్యారని ఆయన వివరించారు. జిల్లా పరిశీలకులు శ్రీనివాసాచారి ఐదు సెంటర్లను, డీఈఓ సోమశేఖరశర్మ మరో నాలుగు కేంద్రాలను పరిశీలించారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

15 నిమిషాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుంచుపల్లి మండలంతో పాటు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకుల కూల్చివేత పనులు జరుగుతున్న క్రమంలో కరెంట్ తీగలపై పెచ్చులు పడడంతో ఆ ఏరియాలో 15 నిమిషాల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పరీక్షల నిర్వహణకు కొంత అంతరాయం ఏర్పడింది. విద్యాశాఖాధికారులు విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ చేసి, సమస్య వివరించడంతో సరఫరా పునరుద్ధరించారు.

పంట నష్టంపై సమగ్ర సర్వే

- డీఏఓ అభిమన్యుడు

ఇల్లెందురూరల్: ఇటీవలి వర్షాలతో జరిగిన పంట నష్టంపై జిల్లా వ్యాప్తంగా సమగ్రంగా సర్వే చేపడుతున్నామని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు తెలిపారు. మండలంలోని మర్రిగూడెం, కొమరారం, మాణిక్యారం గ్రామాల్లో చేస్తున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలం కంటే యాసంగిలోనే మొక్కజొన్న పంట అధిక విస్తీర్ణంలో సాగు చేశారని చెప్పారు. భారీ వర్షంతో పాటు వడగండ్లు పడడంతో నష్టం తీవ్రమైందన్నారు. క్షేత్రస్థాయి సర్వేలో అన్ని రకాల పంటల నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ వాసవీరాణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న, ఏఓ సతీష్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత.. దొడ్డి కొమరయ్య

జయంతి వేడుకల్లో కలెక్టర్ ఘన నివాళి



దొడ్డి కొమరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య నేటి తరానికి స్ఫూర్తి అని కలెక్టర్ అనుదీప్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ మొదట దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటాన్ని తలచుకోగానే మొదట గుర్తొచ్చేది పోరాట యోధుడు కొమరయ్యేనని వ్యాఖ్యానించారు. 1927లో ఉమ్మడి వరంగల్ జిల్లా కడివెండిలో గొర్రెల కాపరుల కుటుంబంలో దొడ్డి కొమరయ్య జన్మించారని, నాడు జరిగిన సాయుధ పోరాటంలో అసువులు బాసిన మొదటి వీరుడని కొనియాడారు. తెలంగాణ ప్రజల కోసం మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకునేందుకే ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సురేందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్

జిల్లాలోని 2,060 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. పోషణ లోప నివారణకు చేపట్టిన ఈ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారని మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని అభినందించారు. పోషణ్ పక్వాడా ముగింపు సందర్భంగా ఐడీఓసీలో సోమవారం ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. పోషకాహార లోపంతో బాధ పడుతున్న చిన్నారులు, కిశోర బాలికలకు చిరు ధాన్యాల ఆహారంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించామని చెప్పారు. రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న గర్భిణుల ఆరోగ్య పరిరక్షణపై చైతన్యపరిచామని తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీల్లో ఆరోగ్యవంతమైన చిన్నారులను ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు చెప్పారు. సుజాతనగర్ మండలం నరసింహసాగర్ కేంద్రంలో మూడేళ్ల చిన్నారి ఉజ్వలశ్రీ రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా పేరు, దేశ రాజధాని తదితర పేర్లను తప్పుల్లేకుండా చెప్పగా చిన్నారితో పాటు అంగన్‌వాడీ టీచర్ నర్సమ్మను కలెక్టర్ అభినందించారు.


ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి..

ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు చేసిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించగా, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.

- అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన గ్రామానికి చెందిన విట్టా సుధారాణి తన తండ్రి ఇంటి పక్క ఉన్న 10 కుంటల భూమిలో జామాయిల్ వేశామని, కొంత భాగంలో పూరిల్లు వేసుకోవడానికి బాగుచేస్తుండగా జేసీబీతో జామాయిల్ తోటను పూర్తిగా ధ్వంసం చేశారని, భూమిలోకి రావొద్దని పంచాయతీ అధికారులు అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని దరఖాస్తు చేయగా సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన జె భీమా, జె హరిబాబు గిరివికాస్ కింద బోరు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందించగా, విచారణ నిర్వహించి నివేదిక అందించాలని ఎంపీడీఓకు ఎండార్స్ చేశారు.

రైతులకు కష్టం రానివ్వని సీఎం

- కళ్లారా నష్టాన్ని చూసి పరిహారం ప్రకటించారు..
- ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- హాజరైన ఎంపీ పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర



బీమా చెక్కు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల

సత్తుపల్లి/వేంసూరు: గాలి దుమారం, వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించిన సీఎం కేసీఆర్ వారికి ఏ కష్టం రాకుండా పరిహారం ప్రకటించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. వేంసూరు మండలం బీరాపల్లిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షత వహించగా మంత్రి సింగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే 2.25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సర్వే జరుగుతోందని తెలిపారు. త్వరలోనే సీఎం ప్రకటించినట్లుగా ఎకరాకు రూ.10వేల పరిహారం అందుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం కంటే ఎక్కువ నష్టపోతేనే పరిహారం ఇవ్వాలని నిబంధనలు విధించిందని, అదికూడా ఆరు నెలలకు అందుతుందని తెలిపారు. కానీ సీఎం కేసీఆర్ తక్షణమే పరిహారం ఇచ్చేలా ఆదేశించారని తెలిపారు. కాగా, ఇన్నాళ్లు తమను అక్కున చేర్చుకున్న ప్రజలు, కార్యకర్తలను గౌరవించి కృతజ్ఞతగా భోజనం పెట్టాలనే సీఎం సూచనలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఎందరో మహనేతల చొరవతో...

ముఖ్యమంత్రులుగా జలగం వెంగళరావు, ఎన్టీ రామారావు రైతులకు మేలు చేయగా.. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రైతులకు మరింత ఎక్కువ లబ్ధి చేకూర్చారని, ప్రస్తుత సీఎం కేసీఆర్ సైతం రైతులకు ఏం చేస్తే బాగుంటారోనని నిత్యం ఆలోచిస్తుంటారని ఎంపీ బండి పార్థసారథిరెడ్డి అన్నారు. అందరి చొరవతోనే తెలంగాణలో రైతులు సంతోషంగా జీవించే పరిస్థితి ఉందని.. తాను రాజకీయాలకు అతీతంగా ఈ విషయం చెబుతున్నానని పేర్కొన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న కేసీఆర్‌కు సీఎంగా మళ్లీ అవకాశం కల్పించి రుణం తీర్చుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ కొందరు స్వార్థంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నప్పటికీ కేసీఆర్‌ను మాత్రం ఏమీ చేయలేరని తెలిపారు. వేంసూరు మండలంలో అభివృద్ధికి మూడు నెలల్లోనే రూ.40 కోట్లు నిధులు మంజూరు చేయించానని చెప్పారు. అనంతరం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడగా, బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులు అందజేశారు.

క్లుప్తంగా

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి..



మాట్లాడుతున్న జీసీసీ డీఎం విజయ్‌కుమార్

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం డీఎం విజయ్‌కుమార్ సేల్స్‌మెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కాగా, పాల్వంచ బ్రాంచ్‌లో సివిల్‌సప్లై గోదాము ఇన్‌చార్జ్ పోస్టు ఖాళీగా ఉండటంతో బూర్గంపాడుకు చెందిన సీనియర్ సేల్స్‌మ్యాన్ కె.రమేశ్‌ను గోదాము ఇన్‌చార్జ్‌గా నియమించారు. హాస్టల్ సరుకుల డీఆర్‌ఎస్ గోదాము ఇన్‌చార్జ్‌గా వెంకటేశ్వర్లను నియమించారు. సమావేశంలో మేనేజర్ లక్ష్మీజీ, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు గోవుల అప్పగింత



లారీలో తీసుకొచ్చిన గోవులు

పాల్వంచ: అనుమతి లేకుండా తరలిస్తున్న గోవులను ఇల్లెందు పోలీసులు పట్టుకుని పాల్వంచలోని గోశాలకు సోమవారం అప్పగించారు. గోశాల నిర్వాహకులు ఆంజనేయశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల నుంచి హైదరాబాద్‌కు గోవులను లారీలో అక్రమంగా తరలిస్తుండగా ఇల్లెందు వద్ద పట్టుకున్నారు. అనంతరం 24 గోవులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు అప్పగించారు. కాగా, లారీలో కిక్కిరిసి పెట్టి తరలించడం వల్ల ఒక ఎద్దు లారీలోనే మృతి చెందింది. మరో 6 ఎద్దుల పరిస్థితి విషమంగా ఉందని గోశాల నిర్వాహకులు ఆంజనేయశర్మ తెలిపారు. గోశాలలో పనిచేసే వారి కొరత ఉందని తెలిపినా బలవంతంగా తెచ్చి దింపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయంలోని హుండీలు ధ్వంసం



ఆలయంలోని ధ్వంసమైన హుండీలు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల సమీపంలో గల పాలగుట్టపై కొలువైఉన్న శ్రీరుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలోని హుండీలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని కానుకలను ఎత్తుకెళ్లి న ఘటన సోమవారం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు ఆలయానికి వెళ్లగా హుండీలు పగలగొట్టి ఉన్నాయని, అందులోని కానుకలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు భావించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



నరసింహారావు (ఫైల్)

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సాయిరాంతండాకు చెందిన గుగులోత్ నరసింహారావు (37) బైక్‌పై తన అత్తను ఎక్కించుకొని గత నెల 31వ తేదీ శుక్రవారం రాత్రి కొమ్ముగూడెం వెళ్లాడు. ఆమెను ఇంటి దగ్గర దించి అదే రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మాచినేనిపేటతండా సమీపంలోగాలి వానకు విరిగిపడ్డ చెట్టు కొమ్మలను ఢీకొని కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన నర్సింహారావును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేశ్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

పాల్వంచరూరల్: పదిరోజుల కిందట ఇంట్లో నుంచి బాలిక వెళ్లిపోయిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఉల్వనూరు పంచాయతీలోని గంగదేవిపల్లి గ్రామానికి చెందిన బాలిక మార్చి 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి మంగయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

తల్లి, కుమారుడిపై కేసు

పాల్వంచరూరల్: భూమి విషయమై మాట్లాడేందుకు వెళ్లిన తనపై తల్లి, కుమారుడు దాడి చేశారని ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన వీరన్న భార్య రంగాతో భూమి విషయమై మాట్లాడేందుకు పద్మ అనే మహిళ మార్చి 26వ తేదీన వారింటికి వెళ్లింది. ఈ సమయంలో రంగాతోపాటు ఆమె కుమారుడు సిద్దు దాడి చేసి కొట్టారని, అసభ్య పదజాలంతో దూషించారని పద్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా తల్లి, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతిచ్చేనా?



- సీతమ్మసాగర్ పనులు ఆపాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు
- సీతారామ ప్రాజెక్ట్‌లోనే సీతమ్మసాగర్ భాగమంటున్న అధికారులు
- ఈ నెల 26న మరోమారు విచారణ

కుమ్మరిగూడెంలో జరుగుతున్న సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు

అశ్వాపురం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ (సీతారామ ప్రాజెక్ట్) పనులు చేపట్టిన విషయం విదితమే. ఈ పనులను నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌టీజీ) చెన్నై ధర్మాసనం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నారంటూ తెల్లం నరేశ్, బి.లక్ష్మీనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుష్ప సత్యనారాయణ, జ్యూడీషియల్ సభ్యుడు డాక్టర్ కొర్లపాటి సత్యగోపాల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దని, పనులకు ఎలాంటి అనుమతులు ఉన్నాయో ఈ నెల 26 వరకు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తూ విచారణను 26కు వాయిదా వేశారు. అయితే ఎన్‌జీటీ ఆదేశాలు ఇచ్చినా బ్యారేజీ పనులు మాత్రం ఆగలేదు.

కొనసాగుతున్న పనులు..

దుమ్ముగూడెం ఆనకట్టకు దిగువన 200 మీటర్ల దూరంలో సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్నారు. ఈ బ్యారేజీ ద్వారా 37.5 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. బ్యారేజీకి అనుబంధంగా 320 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ 2020లో పనులు ప్రారంభించింది. 2022 సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం కాగా 2023 మార్చి వరకు గడువు పొడిగించారు. ప్రభుత్వం మొదట రూ.3 వేల కోట్లతో పనులు చేపట్టగా ప్రాజెక్ట్ పూర్తయ్యే వరకు రూ.5 వేల కోట్లు అవుతుందని అంచనా. మొత్తం ఆరు బ్లాకులు కాగా ఐదు బ్లాకుల్లో ఫియర్ల నిర్మాణం సాగుతోంది. ఆరు బ్లాకుల్లో 68 గేట్లు అమర్చనున్నారు. వేసవి కాలం పూర్తయ్యే జూన్ వరకు గేట్లు అమర్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. ఈ బ్లాక్‌కు అనుబంధంగా 320 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం నిర్మించనుండగా ప్రభుత్వ అనుమతి రాలేదు. ప్రాజెక్ట్ కోసం 3,267 ఎకరాలు సేకరించగా కరకట్టల నిర్మాణం కోసం అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మరో 500 ఎకరాలు సేకరించనున్నారు.

'సీతారామ'లో భాగమే

ప్రభుత్వం రూ.13వేల కోట్ల అంచనాతో ఏడేళ్ల కిందట సీతారామ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. సీతారామ ప్రాజెక్ట్‌లోనే సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ ఒక భాగమని సీతారామ ప్రాజెక్ట్‌కు మంజూరైన పర్యావరణ అనుమతులు సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌కు వర్తిస్తాయని జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి బోర్డు, ఎన్‌జీటీ.. సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ రెండు వేర్వేరు అని.. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌కు అన్ని అనుమతులు పొందాలని జలవనరుల శాఖకు సూచించినట్లు సమాచారం. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ కింద ఉన్న భూమి, ముంపునకు గురయ్యే భూమిని ఏమేరకు సేకరించారు? సీతారామ ప్రాజెక్ట్‌కు ఇచ్చిన పర్యావరణ అనుమతులకు, ప్రస్తుత సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతుల మధ్య వ్యత్యాసాన్ని వివరించాలని, ప్రాజెక్ట్‌కు పది కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, పార్క్ లేదని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డన్ ద్వారా ధ్రువీకరణ, ప్రాజెక్ట్ డీపీఆర్‌ను సమర్పించాలని కమిటీ ఆదేశించింది. ఇప్పటి వరకు పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు చేపడుతున్నారని తెల్లం నరేశ్, లక్ష్మీనారాయణ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు పొందాలని, అనుమతులు వచ్చాక పనులు చేపట్టాలని, ప్రస్తుతం పనులు నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది.

ట్రిబ్యునల్‌కు నివేదిస్తాం

సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు ఆపాలని ట్రిబ్యునల్ ఆదేశాలు రాలేదు. ప్రాజెక్ట్ పూర్తి వివరాలతో వారు కోరిన సమాచారంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిస్తాం. సీతారామ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు వచ్చాయి. సీతారామ ప్రాజెక్ట్‌లోనే సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ ఒక భాగం.

–శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ ఎస్‌ఈ

రిటైర్డ్ హెచ్‌ఎంకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు దంపతులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం మద్దిశెట్టి వెంకటేశ్వరరావు తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు పురస్కారాన్ని డాక్టర్ దైవజ్ఞశర్మ అందించారు. సోమవారం వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు.

బుచ్చయ్యకు మహానంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బుచ్చయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు దూడల బుచ్చయ్య ఉగాది మహానంది పురస్కారం అందుకున్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కవులు, కళాకారులతో పాటు విద్య, వైద్య, ప్రజాసేవ చేస్తున్న ప్రముఖులను గుర్తించి ఈ నెల 2వ తేదీన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, ఏఎన్‌ఎస్ 24 టీవీ సీఈఓ అనుమాడ్ల నాగరాజు ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకున్నట్లు సోమవారం దూడల బుచ్చయ్య వివరాలు వెల్లడించారు.

పూజారులకు నెలసరి వేతనం ఇవ్వండి



మాట్లాడుతున్న మద్దిశెట్టి సామేలు

జూలూరుపాడు: గిరిజన పూజారులకు నెలసరి వేతనం ఇవ్వాలని భారతీయ సర్వ సమాజ్ మహాసంఘ్ (బీఎస్‌ఎస్‌ఎం) రాష్ట్ర చైర్మన్ మద్దిశెట్టి సామేలు డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో గిరిజన పూజారుల సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే నెలలో బీఎస్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో గిరిజన పూజారులతో హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి, రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ చైర్మన్ ఆజాద్, ఏపీ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజుగౌడ్, పొన్నం రామచంద్రరావు, పొన్నం జ్ఞానసుందరి, చలమల హైమావతి, సరోజనినాయుడు, మహమ్మద్ ఫయాజ్, ఎండీ అస్లాం, గరిడేపల్లి రవి, బలగాని శ్రీనివాసరావు, వరుస వెంకన్న, కొడెం సీతాకుమారి, కుదురుపాక నిర్మల, భూక్యా రవి, లకావత్ లలిత, గిరిజన పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరును గుర్తుతెలియని దుండగులు సోమవారం అపహరించారు. ట్రాన్స్‌కో డీఈ యాసిన్, ఏఈ నర్సింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామశివారు జాతీయ రహదారి పక్కన గల మామిడితోటలో 16 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి అందులోని కాపర్‌వైరును ఎత్తుకెళ్లారు. వైరు విలువ రూ.50 వేలు ఉంటుందని డీఈ యాసిన్ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ట్రాలీ పైనుంచి పడి వ్యక్తి మృతి



తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిన మోతీరు

భద్రాచలంటౌన్: ట్రాలీ ఆటో పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. అంబేడ్కర్‌సెంటర్‌లోని ఓ కంపెనీకి చెందిన కూల్‌డ్రింక్స్ డిస్ట్రిబ్యూటర్ వద్ద పెద్ద మోతీరు (45) పనిచేస్తున్నాడు. రోజులాగే దుకాణాలకు కూల్‌డ్రింక్స్ పంపిణీ చేసేందుకు వెళ్తున్న క్రమంలో డిగ్రీ కళాశాల సెంటర్ వద్ద ట్రాలీ ఆటో వెనక కూర్చున్న మోతీరు అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మోతీరును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిన్నట్లు తెలిపారు. మృతుడిది ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక గ్రామం. మృతుడి కుటుంబ సభ్యులు భద్రాచలం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్ట్

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామ శివారు మిరపతోటలో పేకాట ఆడుతున్న వారిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి కథనం ప్రకారం.. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఘటనా స్థలానికి వెళ్లి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నామని, ఐదుగురు పరారయ్యారని, మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత

కాపాడిన పోలీసులు

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన ఒక వివాహిత రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించగా ఆమె కుమారుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రక్షించారు. ఖమ్మం రోటరీనగర్‌లో నివసిస్తున్న కంసాని కావ్య, శ్రీను దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో కావ్య పిల్లలతో సహా ఆదివారం రాత్రి మధిర చేరుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని గుర్తించిన కావ్య కుమారుడు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో మధిర టౌన్ కానిస్టేబుల్ శివ, రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి చేరుకుని ఆమెను కాపాడారు. ప్రతీ సమస్యకు చనిపోవడం పరిష్కారం కాదని ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆదరణ ఫౌండేషన్ నిర్వాహకురాలు నిస్సిహారిణికి అప్పగించారు. అనంతరం సోమవారం బంధువులను పిలిపించి కావ్య, ఆమె పిల్లలను పంపంపించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

సింగరేణి(కొత్తగూడెం): కుటుంబ కలహాల కారణంగా వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. రామవరం నెహ్రూబస్తీలో నివాసముంటున్న దిబ్బ మధుసూదన్ నాలుగేళ్ల కిందట రవళి (26)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఓ పాప ఉంది. కాగా, ఆదివారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మధుసూదన్ భార్యపై చేయిచేసుకున్నాడు. మనస్తాపానికి గురైన రవళి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రవళి తండ్రి నెమిళ్ల రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగులమందు తాగి వ్యక్తి...

సుజాతనగర్: పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సుజాతనగర్ ఠాణాలో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సర్వారం గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాతండాకు చెందిన మాలోత్ మంగు (45) మతిస్థిమితం బాగాలేక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానంతో భార్యను పొడిచిన భర్త

చికిత్స పొందుతూ మృతి



నవిత (ఫైల్)

ములకలపల్లి: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. ఆమెపై కత్తితో దాడి చేశారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. పాల్వంచకు చెందిన ఆరెంపుల రాజేశ్ సుతారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వినన్నపేట మండలానికి చెందిన నవిత (27)తో రాజేశ్‌కు 2015లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. కొంతకాలంగా రాజేశ్ భార్యను అనుమానిస్తున్నాడు. సోమవారం మండలంలోని మాధారం ప్రాంతానికి భార్యను తీసువచ్చిన రాజేశ్.. అక్కడే కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. హఠాత్పరిణామం నుంచి తేరుకున్న నవిత భయపడి పారిపోగా.. రాజేశ్ డయల్ 100కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని నవితను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాజేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. కత్తిగాయం బలంగా తగలడంతో నవిత పాల్వంచ ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందింది.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి



తీవ్ర గాయాలతో నాగేశ్వరరావు


పాల్వంచరూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతిచెందారు. ముగ్గురు గాయపడిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని దంతలబోరు జీపీ గంగదేవిగుప్ప నుంచి ద్విచక్రవాహనంపై కందుకూరి నాగేశ్వరరావు (48) ఆయన భార్య నర్సమ్మ వెళ్తున్నారు. ఏపీలోని కుక్కునూరు మండలం సీతానగరం గ్రామానికి చెందిన గణప రామకృష్ణ, గౌరు సాయిలు ద్విచక్రవాహనంపై గంగదేవిగుప్పవైపు వేగంగా వెళ్తూ నాగేశ్వరరావు బైక్‌ను ఢీకొట్టారు. దీంతో నాగేశ్వరరావు, నర్సమ్మ కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నాగేశ్వరరావు మృతిచెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్ దారుణ హత్య

- భర్తే కాలయముడిగా మారిన వైనం
- మద్యానికి బానిసై వేధింపులతో ఇటీవలే విడాకులకు దరఖాస్తు
- ఇంతలోనే ఘోరానికి పాల్పడిన భర్త

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లా కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. తాగిన మైకంలో ఓ ఆర్టీసీ కండక్టర్‌ను ఆమె భర్తే దారుణంగా హత్య చేశాడు. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వైరా మండలం స్టేజీ పినపాకకు చెందిన ఎక్కిరాల దేవమణి(36)కి తల్లాడ మండలం లక్ష్మీపురానికి చెందిన బంధువు ఇనపనూరి రాంబాబుతో 2006లో వివాహమైంది. వీరికి పిల్లలు ప్రణవ్‌తేజ, అశ్విత ఉన్నారు. అయితే, వివాహమైన కొద్దికాలం నుంచే రాంబాబు మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. ఇంతలోనే దేవమణికి ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం రావడంతో ఖమ్మం మామిళ్లగూడెంలో పిల్లలతో కలిసి ఉంటోంది. ఆ తర్వాత కూడా రాంబాబులో మార్పు రాకపోగా దేవమణిపై వేధింపులు మరింత పెరిగాయి. దీంతో ఈనెల 6వ తేదీన ఆమె విడాకులకు దరఖాస్తు చేసుకోగా, విచారణకు కోర్టు గడువు ఇచ్చింది. కాగా, వీరి కుమారుడు ప్రణవ్ పదో తరగతి చదువుతూ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటుండగా, ఆదివారం ఆయన వద్దకు వెళ్లిన దేవమణి సోమవారం నుంచి జరిగే పరీక్షలు బాగా రాయాలని చెప్పి పండ్లు, బిస్కట్లు ఇచ్చి వచ్చింది.

కాపు కాసి హత్య...



దైవమణి (ఫైల్)

తరచుగా దేవమణి ఉండే ఇంటి వద్దకు వచ్చి మద్యం మత్తులో రాంబాబు గొడవ చేసి ఇంటి ముందు పడుకుని వెళ్లేవాడు. ఈక్రమంలోనే ఆదివారం రాత్రి కూడా వచ్చాడు. అదే సమయాన బాత్‌రూం వెళ్లేందుకు దేవమణి బయటకు రాగా, ఆమెతో గొడవ పడిన రాంబాబు మొదట ఆమె చేతులు విరిచాడు. దీంతో ఆమె కేకలు వేయగా నిద్రలో ఉన్న కూతురు అశ్విత మేల్కొని అడ్డుకోబోగా గొంతు పట్టి గట్టిగా నెట్టేశాడు. ఆతర్వాత దేవమణిని ఇంట్లోకి లాక్కెళ్లిన రాంబాబు అక్కడే ఉన్న రోకలి బండతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందింది. ఆ వెంటనే రాంబాబు పారిపోగా.. అశ్విత తన తాతయ్య, అమ్మమ్మకు ఫోన్ చేసి చెప్పింది. అలాగే, స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్, సిబ్బంది చేరుకుని మృతదేహన్ని మార్చురీకి తరలించడంతో పాటు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తయ్యాక స్వగ్రామమైన పినపాకకు తరలించారు. కాగా, దైవమణి సోదరుడు వరంగల్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

నివాళులర్పించిన ఆర్టీసీ ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళా కండక్టర్ దేవమణి మృతిపై ఖమ్మం ఆర్టీసీ డీఎం బి.శ్రీనివాస్, సీఐ రామయ్య, ఉద్యోగులు సంతాపం తెలిపారు. డీఎం, సీఐతో పాటు ఉద్యోగులు, సంఘాల నాయకులు ఏఎస్.రావు, భాస్కర్, పాషా, గడ్డం లింగయ్య, వెంకటేశ్వర్లు, పిట్టల సుధాకర్, తోకల బాబు, పర్వీన్, మల్లికాంబ, సీతారామయ్య, గుండు మాధవరావు, లింగమూర్తి, రోశయ్య, సరిత, నాగేశ్వరావు, భాగ్యలక్ష్మి, మెరుగు రవీంద్రనాథ్, యాదగిరి, పిల్లి రమేష్, అనిత తదితరులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, సంస్థ తరపున దేవమణి అంత్యక్రియలకు రూ.20వేల నగదునుటీఐ రాయప్ప ఆమె కుటుంబీకులకు అందజేశారు.

నిజమే.. నిధులు మళ్లించాం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన వ్యక్తిగత వైద్యుడే పరోక్షంగా సమ్మతించడంతో విచారణకు అంగీకరించక తప్పలేదు. చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డ రామోజీరావును సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం దాదాపు 8 గంటలపాటు విచారించారు. విచారణ ప్రక్రియను పూర్తిగా ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా భారీగా నిధుల మళ్లింపు, రిజర్వ్ బ్యాంకు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ డిపాజిట్ల సేకరణపై ఆధారాలతో విచారించారు. ఈ కేసులో ఏ–2గా ఉన్న రామోజీరావు కోడలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించనున్నారు. అనంతరం కేసు దర్యాప్తులో పురోగతిని సమీక్షించి రామోజీరావు, శైలజను ఆంధ్రప్రదేశ్‌కు పిలిచి మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

తప్పించుకునేందుకు చివరిదాకా యత్నం..

మార్గదర్శి అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు చివరి వరకూ ప్రయత్నించారు. రామోజీరావు, శైలజ హైదరాబాద్‌లోనే వారి నివాసంలోగానీ కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ సీఐడీ అధికారులు నోటీసులిచ్చారు. నాలుగు తేదీలు సూచించి వారికి అనువైన రోజు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తామని స్పష్టం చేశారు. అయితే విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు కాలయాపన చేశారు. చివరికి మార్చి 31న రామోజీ ఫిల్మ్‌సిటీలోని తన కార్యాలయంలో విచారణకు హాజరవుతానని సీఐడీకి తొలుత సమాచారం ఇచ్చారు. తీరా సోమవారం రోజు ఫిల్మ్‌సిటీలో కాకుండా జూబ్లీహిల్స్‌లోని తన కోడలు శైలజ కిరణ్ నివాసంలో విచారణకు హాజరవుతానని పేర్కొనగా అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఈ మేరకు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దార్, విచారణాధికారి రవికుమార్‌తోపాటు అధికారుల బృందం జూబ్లీహిల్స్‌లోని శైలజ నివాసానికి ఉదయం 10.30 గంటలకు చేరుకుంది. సీఐడీ అధికారులు రావడమే ఆలస్యం తన ఆరోగ్యం సరిగా లేనందున విచారణకు సహకరించలేనని రామోజీ పేర్కొన్నారు. అనారోగ్యానికి కారణాలు, నివేదికలు అందచేసి విచారణకు హాజరు కాలేరని ధృవీకరించాలని రామోజీరావు వ్యక్తిగత వైద్యుడిని సీఐడీ అధికారులు కోరారు. దీంతో రామోజీని విచారించవచ్చని, మంచంపై పడుకుని సమాధానాలు ఇస్తారని ఆయన వైద్యుడు చెప్పడంతో అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, కేసును సక్రమంగా విచారించడమే తమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇక తప్పదని స్పష్టం కావడంతో సీఐడీ అధికారుల విచారణకు రామోజీ సమ్మతించారు.



ఆరోగ్యం బాగోలేదంటూ మంచంపైన రామోజీరావు.. కానీ, ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్.. ఈ సందర్భంగా వీడియో రికార్డింగ్‌తో విచారిస్తున్న సీఐడీ అధికారులు

ఆడియో... వీడియో రికార్డింగ్

విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించారు. ఈ ప్రక్రియ మొత్తం రికార్డింగ్ చేశారు. రామోజీ పడుకున్న మంచం సమీపంలోనే వేర్వేరు కోణాల్లో రెండు కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయనకు కాస్త దూరంగానే సీఐడీ అధికారులు కూర్చున్నారు. విచారణ సందర్భంగా రామోజీరావు చెప్పిన సమాధానాలు, ఆయన హావభావాలు అన్నీ రికార్డ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సుదీర్ఘ విచారణ సందర్భంగా సీఐడీ అధికారుల బృందం అక్కడ కనీసం మంచినీళ్లు కూడా తాగలేదు. తమకు కావల్సిన ఆహారం, మంచినీళ్లు అంతా బయట నుంచే తెచ్చుకున్నారు.

నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లపై..

విచారణలో సీఐడీ అధికారులు కీలక విషయాలను రాబట్టినట్టు సమాచారం. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు అక్రమంగా బదిలీ, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ, రికార్డుల నిర్వహణలో అవకతవకలపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలు, బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్ ఇచ్చిన వాంగ్మూలం కాపీలను చూపిస్తూ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసేందుకు రామోజీరావు ప్రయత్నించారు. కీలక పత్రాలు, బ్యాంకు లావాదేవీల కాపీలు, బ్యాలెన్స్ షీట్ల కాపీలను చూపిస్తూ అధికారులు ప్రశ్నించడంతో ఇక మాట్లాడలేకపోయారని తెలుస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లోని నిధులను ప్రధాన కార్యాలయానికి మళ్లించడం నిజమా.. కాదా? అని సూటిగా ప్రశ్నించడంతో అవునని రామోజీ అంగీకరించాల్సి వచ్చింది. చిట్‌ఫండ్స్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఇతర షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన ఆధారాలను కూడా సీఐడీ అధికారులు చూపించి ప్రశ్నించగా అదంతా మార్గదర్శి ఆర్థిక ప్రణాళికలో భాగమని రామోజీ చెప్పినట్టు సమాచారం. అంటే చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం వాస్తవమే కదా? అని ప్రశ్నించడంతో ఔనని రామోజీరావు అంగీకరించారని సమాచారం. చిట్టీల చందాదారులు పాడిన మొత్తాన్ని ఇవ్వకుండా 'రశీదు' మాత్రమే ఇస్తూ 5శాతం వడ్డీ చెల్లిస్తున్న విషయంపై కూడా సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. తాము అట్టిపెట్టుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తున్నాం కదా అందులో అక్రమం ఏముందనీ రామోజీరావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని చెప్పి నగదును అట్టిపెట్టుకోవడం అంటే అది డిపాజిట్ సేకరణే అవుతుంది కదా... చిట్‌ఫండ్ కంపెనీలను డిపాజిట్ల సేకరణకు రిజర్వ్‌బ్యాంకు అనుమతించిందా? అంటే రామోజీరావు స్పందించకుండా మౌనం వహించారని సమాచారం. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ అధికారులు నమోదు చేసిన అభియోగాలన్నీ దాదాపు వాస్తవమేనని ఆయన పరోక్షంగా సమ్మతించినట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు, ఆడిటింగ్ వ్యవహారాలు చూసిన చార్టర్డ్ అకౌంటెంట్ కూడా నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్లకు పాల్పడినట్టు సమ్మతించారు.

స్టేట్‌మెంట్ విశ్లేషించాక తదుపరి చర్యలు: అమిత్ బర్దార్, ఎస్పీ

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాలకు సంబంధించి 7 కేసులు నమోదయ్యాయి. రామోజీరావును విచారించి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశాం. అది విశ్లేషించాల్సి ఉంది. మార్గదర్శి ఎండీ శైలజను ఈ నెల 6న విచారిస్తాం. కేసులో కనుగొన్న ఆధారాలు, పురోగతిని బట్టి తదుపరి చర్యలు చేపడతాం'

సహకరించని రామోజీ

సీఐడీ అధికారులు విచారణ మొదలు పెట్టిన తరువాత రామోజీరావు సమాధానాలు చెప్పేందుకు చాలాసేపు ససేమిరా అన్నారు. సీఐడీ పరిధినే ప్రశ్నిస్తూ తనను అసలు విచారించడానికే వీల్లేదన్నట్టుగా వ్యవహరించడం గమనార్హం. తాను విచారణ సంస్థలకు అతీతమన్నట్టు మొండిగా వ్యవహరించారు. దీంతో చట్ట నిబంధనలను తెలియచేస్తూ సీఐడీ అధికారులు విచారణ ప్రక్రియ కొనసాగించారు. చిట్‌ఫండ్స్‌లో అక్రమ వ్యవహారాలన్నింటికీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్), అకౌంటెంట్లదే బాధ్యతని, తనకు సంబంధం లేదని తప్పించుకునేందుకు రామోజీరావు ప్రయత్నించారు. బ్రాంచి కార్యాలయాల్లోనే అన్ని వ్యవహారాలు సాగినందున వారినే ప్రశ్నించాలని మొండికేసినట్లు తెలుస్తోంది. బ్రాంచి మేనేజర్లకు రూ.500కు మించి చెక్‌పవర్ లేనప్పుడు భారీగా నిధుల బదిలీపై వారిని మాత్రమే ఎలా బాధ్యులను చేస్తామని సీఐడీ అధికారులు ఎదురు ప్రశ్నించడంతో రామోజీరావు మౌనం వహించారు. బ్రాంచిల నుంచి నిధులన్నీ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలింపుపై కూడా తనకు సంబంధం లేదని రామోజీ వాదించారు. మరి చెక్ పవర్ మార్గదర్శి ఎండీ శైలజ, ప్రధాన కార్యాలయంలోని మరో 10 మంది వద్ద ఎందుకు ఉందని విచారణ అధికారులు ప్రశ్నించడంతో రామోజీ సమాధానం చెప్పలేకపోయారు. చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్‌మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఆర్జించిన ఆదాయం అంతా చైర్మన్, ఎండీలుగా వారే ప్రయోజనం పొందుతున్నప్పుడు కేవలం జీతాలకు పనిచేసే మేనేజర్లు ఎలా బాధ్యులవుతారని సీఐడీ అధికారులు ప్రశ్నించారు.

తదుపరి విచారణ ఏపీలో!

మార్గదర్శి వ్యవహారంలో ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ అధికారులు కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నారు. అందుకోసం రామోజీరావు, శైలజలను త్వరలో ఆంధ్రప్రదేశ్‌కు రప్పించి విచారించాలని భావిస్తున్నారు. నేరం జరిగిన ప్రదేశం(సీన్ ఆఫ్ అఫెన్స్) ఆంధ్రప్రదేశ్ కాగా మన రాష్ట్రంలోని చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు తీరును సమీక్షించిన అనంతరం తదుపరి విచారణ కోసం రామోజీరావు, శైలజలను రాష్ట్రానికి రప్పించాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో వారు ఎంపిక చేసుకున్న నగరంలో విచారించేందుకు సమాయత్తమవుతున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే సీఐడీ అధికారులు సమాచారం ఇచ్చారు.

సన్నాలకు 'మద్దతు'కు మించి ధర

- క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లింపులు
- పోటీ పడి కొంటున్న రైస్ మిల్లర్లు
- భారీ డిమాండ్‌తో రైతుల ఆనందం

మిర్యాలగూడ: ఈ సీజన్‌లో సన్న ధాన్యానికి భారీగా డిమాండ్ పెరగడంతో మిల్లర్లు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో యాసంగి సీజన్ సాగుకు సకాలంలో నీరు అందడంతోపాటు, దోమపోటు బెడద లేకపోవడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం వాహనాల రాకను అడ్డుకుంటే స్థానిక రైతులు పండించిన ధాన్యానికి మరింత ధర వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగి సీజన్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సారి సన్నరకాల్లో అంకూర పూజ, హెచ్ఎంటీ, కావేరి చింట్లు వంటి వాటిని సాగు చేసిన రైతులు నేరుగా రైస్ మిల్లులకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా వద్ద భారీ రైస్‌మిల్లు ఉంది. గంటకు 16 టన్నుల ధాన్యాన్ని మర ఆడించే సామర్థ్యం ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల రైతులందరూ ఆ మిల్లుకే ధాన్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మిర్యాలగూడ రైస్‌మిల్లర్లు కూడా ఎక్కువ ధర చెల్లించైనా కొనుగోలు చేయాలని పోటీపడుతున్నారు.



మిర్యాలగూడలో రైస్‌మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

పక్క రాష్ట్రాల్లో డిమాండ్

సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2060, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 ఉంది. తెలంగాణ సన్నరకం ధాన్యానికి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో అధిక డిమాండ్ ఉండడంతో మన రాష్ట్రం ధాన్యాన్ని అక్కడి వారు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెపుతున్నారు. ధాన్యానికి మంచి ధర వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సన్నాలకు మద్దతు ధర మించి చెల్లిస్తున్నారు



ఇటీవలే నేను ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసుకుపోయి అమ్మగా క్వింటాలుకు రూ.2,350 చొప్పున ధర చెల్లించారు. రెండు ఎకరాల్లో 70 బస్తాల ధాన్యాన్ని పండించాను. ప్రభుత్వ మద్దతు ధరకు మించి రేటు రావడంతో ఆనందంగా ఉంది.

– ఠాకూర్ బాలాజీసింగ్, రైతు, పెద్దదేవులపల్లి

నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర



రైతులు మిల్లులకు తీసుకొచ్చిన నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర లభిస్తుంది. రైస్ మిల్లులకు ఒకేసారి భారీ ఎత్తున ధాన్యంతో రాకుండా రైతులు విడతల వారీగా ధాన్యం తీసుకొస్తే ఇదే ధర కొనసాగించే అవకాశం ఉంది.

– కర్నాటి రమేశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చింతకాని: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన మరువక ముందే పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాలు బయటకు వచ్చాయని.. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని మరువకముందే పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కావడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనల ద్వారా తెలుస్తోందని చెప్పారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతతో పాటుగా పదో తరగతి విద్యార్థులకు సీఎం కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో పాటు రాజీనామా చేయాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. తన పార్టీ మార్పుపై అతిత్వరలోనే ప్రజా మోద నిర్ణయాన్ని తీసుకుంటానని తెలిపారు.

జిల్లా వార్తలు

పోరాటాలతోనే పేదలకు ఇళ్ల స్థలాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మహబూబాబాద్: దరఖాస్తులు, దండాలు పెడితే కాకుండా పోరాటాలు చేస్తేనే ఇళ్ల స్థలాలు వస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, జీఓ 58, 59 పక్కాగా అమలుచేయాలనే డిమాండ్‌తో మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తమ్మినేని మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తామని పీఎం మోదీ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇకనైనా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి రాష్ట్రప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్రప్రభుత్వం రూ.10లక్షల ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంపన్న వర్గాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే వారికి సహకరిస్తున్న అధికారులు.. పేదలను మాత్రం కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే సీఎంతో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును కలిసి విషయం వివరిస్తామని ఆయన చెప్పారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడగా నాయకులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, పాలబిందెల మల్లయ్య, కుర్ర మహేష్, హేమానాయక్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రశ్నపత్రం లీక్



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్


ఖమ్మంమయూరిసెంటర్: పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వికారాబాద్ జిల్లా తాండూర్‌లో పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ అయిందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్‌తో పాటు జి.దీపిక, సతీష్, శ్రీకాంత్, తరుణ్, రాకేష్, రవితేజ, సాయి పాల్గొన్నారు.

పాడి రైతులకు శుభవార్త

పాల సేకరణ ధర పెంపు

- గేదె పాలు రూ.7, ఆవుపాలు రూ.5 మేర పెంచుతూ నిర్ణయం
- ఈనెల 1నుంచి అమల్లోకి..
- పాల సేకరణపై పెంపుపై అధికారుల దృష్టి

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డయిరీ) పాడి రైతులకు శుభవార్త చెప్పింది. పాల సేకరణ ధరలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. వెన్న శాతం ఆధారంగా పాల ధర నిర్ణయిస్తుండగా.. గేదె పాలకు గరిష్టంగా రూ.7, ఆవుపాల ధర గరిష్టంగా రూ.5 మేర పెంచారు. ధరల పెంపును ఈనెల 1వ తేదీ నుంచే అమలు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెన్న శాతం ఆధారంగా పాల ధర చెల్లించటంతో పాటు నగదు ప్రోత్సాహకంగా లీటర్ పాలకు ప్రభుత్వం రూ.4 చెల్లిస్తోంది. ప్రోత్సాహకంతో కలిపితే గేదె పాలకు గరిష్టంగా రూ.11 వరకు, ఆవు పాలకు రూ.9 వరకు పెరిగినట్లవుతుంది. ఖమ్మం పాడి పరిశ్రమ పరిధిలోని ఆరు బల్క్‌మిల్క్ సెంటర్ల నుంచి నిత్యం గేదెపాలు 6,700 లీటర్లు, ఆవుపాలు 2 వేల లీటర్లను సేకరిస్తున్నారు. కానీ ఖమ్మం పాడి పరిశ్రమ సామర్థ్యం దాదాపు 50వేల లీటర్లుగా ఉన్న నేపథ్యాన పాల సేకరణ పెంపుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.



పాల సేకరణ ధరలు(లీటర్‌కు రూ.ల్లో)

వెన్నశాతం	పాత ధర	కొత్త ధర
గేదె పాలు		
5 శాతం	36.50	40.35
10 శాతం	73.50	80.10
ఆవుపాలు		
3 శాతం	35.65	40.25
4.9 శాతం	41.54	46.90

మరిన్ని ప్రయోజనాలు



ప్రభుత్వం పాల సేకరణ ధరలు పెంచింది. అలాగే, ప్రోత్సాహకంగా లీటర్‌కు రూ.4 చెల్లిస్తున్నారు. ఇవేకాక పాడి రైతు కూతురు పెళ్లికి పెళ్లి కానుక పేరిట రూ.5 వేలు, ఎవరైనా మృతి చెందితే రూ.5 వేలు, రైతుల పిల్లల ఉన్నత చదువులకు(మెరిట్) రూ.5వేలు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను పరిగణనలోకి తీసుకొని రైతులు విజయ డెయిరీని ఆదరించాలి.

– ఏ.కుమారస్వామి, డీడీ, పాడి పరిశ్రమ ఖమ్మం

10వ తేదీ వరకు ముత్యాల తలంబ్రాల బుకింగ్

ఖమ్మంమామిళ్లగూడెం: భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలు ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకునేందుకు ఈనెల 10 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం కేశరాజు భానుకిరణ్ తెలిపారు. రాష్ట్వ్యాప్తంగా ఇప్పటి వరకు లక్ష మందికి పైగా తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీ వరకు మొదటి విడతలో 50 వేల మంది భక్తుల ఇంటికి తలంబ్రాలు చేర్చామని తెలిపారు. ఇంకా గడువు ఉన్నందున సమీపంలోని లాజిస్టిక్స్ కౌంటర్‌లో కానీ, ఆర్టీసీ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ను కానీ సంప్రదించి రూ.116 చెల్లించాలని ఆయన సూచించారు.

'పది' విద్యార్థులకు నడక యాతన

పాల్వంచరూరల్ : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఏజెన్సీ ప్రాంతంలోని పలువురు విద్యార్థులకు నడక యాతన తప్పడం లేదు. బస్సు సౌకర్యం కల్పించక, కనీసం ఆటోలు కూడా అందుబాటులో లేక నడిచి వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. పాల్వంచ మండలం పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 56 మంది ఐదు కిలోమీటర్ల దూరంలోని బూర్గంపాడు మండలం ఉప్పుసాక కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. వీరికి బస్సు సౌకర్యం లేక కాలినడకనే వెళ్లి రావాల్సి వస్తోంది. ఇదే మండలంలోని యానంబైలు పాఠశాలలో చదువుతున్న 18 మంది మూడు కిలోమీటర్ల దూరంలోని కిన్నెరసాని ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష రాస్తున్నారు. వీరికి కూడా కాలినడకే శరణ్యం. పరీక్ష పూర్తయ్యాక ఎండలో అంతదూరం నడవడంతో విద్యార్థులు అలసిపోతున్నారని, తమ పాఠశాలల విద్యార్థుల కోసం రవాణా సదుపాయం కల్పించాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోలేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



యానంబైల్ నుంచి కాలినడకన కిన్నెరసాని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

వేతన సవరణపై విద్యుత్ ఉద్యోగుల పోరాటం



సమావేశంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: వేతన సవరణ సాధనతో పాటు ఇతర సమస్యలపై పోరాటానికి విద్యుత్ ఉద్యోగులు సమాయత్తమయ్యారు. ఈమేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఉద్యోగుల జేఏసీ బాధ్యులు సోమవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. టీఎస్‌పీఎస్ జేఏసీ ఇచ్చిన సూచన మేరకు పలు అంశాలపై చర్చించగా సమస్యల సాధనకు సమ్మె అనివార్యమనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో భాగంగా 7వ తేదీన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి ఆర్టిజన్లు, కార్మికులు, అధికారులతో ఖమ్మంలో సన్నాహక సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించి విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జేఏసీ జిల్లా చైర్మన్ శేషగిరిరావు, కన్వీనర్ హీరాలాల్, కోచైర్మన్ రవికుమార్‌తో పాటు ఎం.ప్రసాద్, నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, నాగార్జున, రామకృష్ణ, శ్రీనివాస్, వంశీ, లక్ష్మీనర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారంపై దృష్టి

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో సమర్పించే గిరిజనుల సమస్యలపై ఇచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయా యూనిట్ల అధికారులకు అందచేసి అర్హతల మేరకు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఆతర్వాత ఏపీఓ మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా, అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మునీర్‌పాషా, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ నిర్వహణ అప్పగింతపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండిరేవులో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యాన నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలను మైదాన ప్రాంత వ్యక్తికి అప్పగించడాన్ని పలువురు తప్పుపట్టారు. ఈమేరకు ఐటీడీఏ గిరిజనదర్బార్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఏజెన్సీ గ్రామ ఆదివాసీ, గిరిజన రైతులకు చేయూతనిచ్చేలా గోదాం నిర్మాణానికి ఇరవై ఏళ్ల క్రితం స్థానికులు భూమి విరాళం ఇవ్వగా, ఆ స్థలంలో నిర్మిస్తున్న జీసీసీ పెట్రోల్ బంక్‌ను తనకు కేటాయించారని మైదాన ప్రాంతానికి చెబుతున్న మహిళ చెప్పుకుంటోంది. దీంతో స్థానికులు గిరిజన దర్బార్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపిస్తానని ఏపీఓ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో పీసా కార్యదర్శి ఆగే రాజేశ్వరితో పాటు సరియం వీర్రాజు, పోడియం వెంకటరమణ, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఓకు ఫిర్యాదు చేస్తున్న చిన్నబండిరేవు గ్రామస్తులు

బీఆర్‌ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన విజయ్‌బాబు తదితరులు

- త్వరలోనే పార్టీ నిర్ణయాన్ని ప్రకటిస్తా..
- అశ్వారావుపేట నుంచే విజయాలు ఆరంభం
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట/దమ్మపేట/ములకలపల్లి: మరో ఐదు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి.. ఆ కురుక్షేత్రంలో అశ్వారావుపేట నుంచే తమ గెలుపు ప్రారంభం కానుందని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లిల్లో సోమవారం ఆయన క్యాంపు కార్యాలయాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తన నిర్ణయం వెల్లడించకపోయినా వేలాది మంది వెంట నడుస్తున్నారని, వారందరికీ రుణపడి ఉంటానని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బ్రతుకులు బాగుపడుతాయని కలలు కంటే అవేమీ నెరవేరలేదని తెలిపారు. మాటల గారడీ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ మరోసారి అదే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వకపోగా, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తాజాగా కొందరికి పట్టాలు ఇస్తామని చెప్పడం ఏమిటని పొంగులేటి ప్రశ్నించారు.

ఓటు నోటు కేసు నిందితుడికే తెలియాలి

ఆత్మీయ సమ్మేళనాల పేరుతో తమపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అన్నారు. సత్తుపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కోడి పందేలు, మద్యం టెండర్లు వేస్తున్నట్లుగా కొందరు ఆరోపించారని పేర్కొన్నారు. అయితే, కోడి పందేలు చూడడం ఏమీ తప్పు కాదన్నారు. ఇక సీఎం కేసీఆర్ మద్యం తాగడం లేదా, మద్యం పాలసీ తెచ్చింది సీఎం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ ఓటు నోటు కేసులో నిందితుడిగా ఉన్న వాళ్లకే తెలియాలని పేర్కొన్నారు. ఈసమావేశాల్లో సర్పంచ్‌లు అట్టం రమ్య, నాయకులు జారే ఆదినారాయణ, కనసోతు లింగయ్య, రేమళ్ల కేదార్‌నాథ్, జూపల్లి రమేష్, ములకలపల్లి బత్తుల అంజి, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగేందర్, యర్రగొర్ల రాధాకృష్ణ, రావు రవిశంకర్, నాయుడు శ్రీను, పర్వతనేని ప్రసాద్, చక్రాల మల్లేశ్వరరావు, చామర్తి గోపిశాస్త్రి, ముళ్లపూడి వెంకటరమణ, గుర్రం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.